శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

## కామాక్షితాయి సేవలో ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి,ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దంపతులు



**బుచ్చి అక్టోబర్ 3 ప్రభాతవార్త** పవిత్రపుణ్యక్షేత్రమైన జొన్నవాడలోని శ్రీమల్లికార్జునస్వామి కామాక్షితాయి సన్నిధిలో ప్రారంభం అయిన శరన్నవరాత్రి వేడుకలలో ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి,కోవూరు శాసనస భ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు.ఆలయ అర్చకులు ఆలయ ఇ.ఒ ఆర్వభూమి శ్రీనివాసులురెడ్డి ఆలయ మర్యాదాలతో వారిని స్వాగతించారు.ఈ సందర్భంగా వారు అమ్మవారి ఆడియోను ఆవిష్కరించారు.ఈకార్యక్రమంలో ఆమె వెంట పలువురు టిడిపినాయకులు పాల్గొన్నారు.

## శ్రీమల్లికార్జునస్వామి కామాక్షితాయి సన్నిధిలో ప్రారంభమైన శరన్నవరాత్రి ఉత్సవాలు



**బుచ్చి అక్టోబర్ 3 ప్రభాతవార్త** పవిత్రపుణ్యక్షేత్రమైన జొన్నవాడలోని శ్రీమల్లికార్జునస్వామి కామాక్షితాయి సన్నిధిలో శరన్నవరాత్రి ఉత్సవాలను ఆలయ ఇ.ఒ ఆర్వభూమి శ్రీనివాసులురెడ్డి,అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభించారు.పెన్నానదిలో పూజా కార్యక్రమాలు నిర్వహించి పుట్టమన్ను తీసుకొని వచ్చారు.మంగళవాయిద్యాల నడుమ పెద్దఎత్తున భక్తులు హాజరు కాగా పూజా కార్యక్రమాలు ప్రారంభించారు.

## అబ్దుల్ అజీజ్‌ని మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే కోటంరెడ్డి



**నెల్లూరు, అక్టోబర్ 3, ప్రభాతవార్త – వైద్యం** తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ అజీజ్‌ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్‌బోర్డ్ చైర్మన్‌గా నియమితులైన సందర్భంగా గురువారం నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి హరనాథపురంలోని అజీజ్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి బొకే మొక్కను అందజేసి సత్కరించారు. వారు పలు విషయాలపై చర్చించారు.

## కొండా సురేఖను మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలి



**కోవూరు,అక్టోబర్3 ప్రభాతవార్త** : చిత్రరంగానికి ఎన్టీఆర్ , ఏఎన్ఆర్‌లు రెండు కళ్లు లాంటి వారని, అటువంటి వారిలో ఏఎన్ఆర్ కుటుంబంపై తెలంగాణ మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు అత్యంత దారుణమని, వెంటనే ఆమెను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంత్రి వర్గం నుంచి తొలగించాలని కోవూరు మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ భారతదేశంలోనే అక్కినేని కుటుంబానికి ఎంతో పేరు ప్రతిష్టతలు ఉన్నాయన్నారు. చలనచిత్ర రంగానికి ఆ కుటుంబం ఎన్నో సేవలు కూడా చేసిందన్నారు. అటువంటి కుటుంబంపై తెలంగాణ మంత్రి కొండా సురేఖ తమ ఇష్టారాజ్యంగా వ్యాఖ్యలు చేయడం తాము తీవ్రంగా ఖండిస్తున్నామని, వెంటనే ఆమెను మంత్రి వర్గం నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

## షామీర్ పాలెంలో పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేయాలని సబ్ కలెక్టర్‌కు వినతి



**కందుకూరు, అక్టోబర్ 3, ప్రభాతవార్త** కందుకూరు మున్సిపాలిటీ పరిధిలోని శామీర్ పాలెం గ్రామంలో పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేయాలని గురువారం పలువురు గ్రామస్తులు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు ఎన్నికలు జరిగే ప్రతిసారి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆనందపురం గ్రామం వెళ్లి ఓటు హక్కు వినియోగించుకోవాల్సి వస్తుందని, గ్రామంలో ఉన్న వృద్దులు వికలాంగులు అనారోగ్య బాదితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. అక్కడ ఉన్న పోలీసు స్టేషన్ పరిధిలో సుమారు 1500 ఓట్లు ఉండటం వలన ఎలక్షన్ రోజు ఓటింగ్ పూర్తి అయ్యే సరికి సుమారు రాత్రి ఒంటిగంట ఆ ప్రాంతం అవుతుంది. గ్రామస్తులు తమ ఆవేదనను ఆమెకు వివరించారు. కూలి, వ్యవసాయ పనులు మానుకొని చాలాసేపు క్యూ లైన్‌లో ఉండవలసి వస్తుందని తెలిపారు. అంతే కాకుండా ఆనందపురం గ్రామంలో అక్కడ ఒకే సామాజిక వర్గం ఎక్కువగా ఉండటం వలన శామీర్ పాలెంలో వివిధ సామాజిక వాళ్లు తక్కువగా ఉండటం వలన వాళ్లని భయభ్రాంతులను చేసి ఓట్లు స్వచ్ఛందంగా వేయనీయకుండా చేస్తున్నారని, శామీర్ పాలెం గ్రామంలోని పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేయాలని విన్నవించారు. అనేక ఎన్నికల పర్యాయాలు అక్కడ ప్రతిసారి గొడవలు జరుగుతున్నారు. సుమారు మా గ్రామం 800 ఓట్లు ఉండటం వలన మా గ్రామంలో ప్రజలు స్వచ్ఛందంగా అక్కడ ఓట్లు వేయలేకపోతున్నారు. గ్రామ ప్రజల అభిప్రాయాలు పరిశీలించి షామీర్‌పాలెం గ్రామంలో ఉన్న అన్ని వసతులు ఉన్న స్కూల్లో కొత్త పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.సుభాని, ఎం.క్రాంతి. మహబూబ్‌భాషా, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## సోమిరెడ్డిని కలిసిన అబ్దుల్ అజీజ్



**నెల్లూరు, అక్టోబర్ 3, ప్రభాతవార్త– వైద్యం** తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ అజీజ్‌ని ఆంధ్రరాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్‌గా నియమితులైన సందర్భంగా అబ్దుల్ అజీజ్ అల్లీపురంలోని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి నివాసంలో సోమిరెడ్డిని కలిసి శాలువా బొకేతో సత్కరించారు. అనంతరం వారిరువురు పలు విషయాలను చర్చించుకున్నారు.

## స్వర్ణాంధ్ర 2047 డాక్యుమెంటరీ పై అధికారులు, ప్రజాప్రతినిధులతో వర్క్ షాప్ నిర్వహణ



**నెల్లూరు అర్బన్, అక్టోబర్ 3, ప్రభాతవార్త** జిల్లాలో స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంటరీని ప్రజా ప్రతినిధులు, ప్రజలు సహకారంతో తయారు చేయడానికి చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ అన్నారు. బుధవారం స్థానిక శ్రీ వెంకటేశ్వర కస్తూరిబా కళాక్షేత్రంలో స్వర్ణాంధ్ర 2047 డాక్యుమెంటరీ పై అధికారులు, ప్రజాప్రతినిధులతో వర్క్ షాప్‌ను నిర్వహించారు. రాష్ట్రంలో స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంటరీ తయారు చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. రాష్ట్రాన్ని రాబోయే 25 సంవత్సరాలలో అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించే దిశగా తయారు చేయడానికి ముఖ్యమంత్రి చర్యలు తీసుకున్నారు. స్వర్ణాంధ్ర 2047 విజన్‌లో ప్రజల యొక్క సూచనలు సలహాలు తీసుకోవడానికి క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జిల్లాలో ప్రజలందరూ స్వర్ణాంధ్ర 2047 విజన్ కొరకు క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి సూచనలు సలహాలు పొందపరచాలని ఆయన సూచించారు. జిల్లాలో స్వర్ణాంధ్ర 2047 విజన్ కొరకు అన్ని గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించడం జరిగిందని ఆయన తెలియజేశారు. జిల్లాలో ఇప్పటి వరకు 50 వేల మంది ప్రజలు క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి వివరాలను పొందుపరిచారన్నారు.

**విజన్ ప్రణాళిక తయారీలో ప్రజల భాగస్వామ్యం ఎక్కువగా ఉండాలి..వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి** ఈ కార్యక్రమంలో పాల్గొన్న నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటు ద్వారానే నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడం వీలు అవుతుందని చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మీద నమ్మకంతో రాష్ట్రంలో పరిశ్రమలు స్థాపించడానికి పారిశ్రామికవేత్త ముందుకు వస్తున్నారని ఆయన అన్నారు. నెల్లూరు జిల్లాలో రామయ్యపట్నం పోర్ట్‌లో బిపిసిఎల్ ఆయిల్ కంపెనీ వారు ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చారన్నారు. జిల్లాలో ఎక్కువగా పరిశ్రమలు స్థాపించి నిరుద్యోగ యువతకు ఉపాధి



అవకాశాలు కల్పించే విధంగా 2047 విజన్ డాక్యుమెంటరీ తయారు చేయాలని ఆయన అధికారులు సూచించారు. విద్యుత్ వినియోగం పెరుగుతున్న దృష్ట్యా తక్కువ రేటుకు ప్రజలకు విద్యుత్ అందించడానికి ముఖ్య మంత్రి కృషి చేస్తున్నారన్నారు. ఎంతో మంది విలువైన సూచనలు చేశారని, విజన్ ప్రణాళిక ఇప్పటి నుండి మొదలు పెడితేనే రాబోయే 22 ఏళ్ళలో లక్ష్యాలు సాధించడానికి ఉపయోగ పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, జడ్పి చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ, నెల్లూరు నగర పాలక సంస్థ చైర్ పర్సన్ పొట్లూరి స్రవంతి, జిల్లా అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిదులు రైతులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## బుచ్చి మున్సిపాల్టీలో గోల్‌మాల్ అయిన 2 కోట్లపై విచారణ జరపాలి

### ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని కోరిన కౌన్సిలర్ షేక్ షాహుల్






**బుచ్చి అక్టోబర్ 3 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ అధ్యక్షతన జరిగింది. ఈకార్యక్రమానికి ముఖ్య అతిధిగా కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పాల్గొన్నారు. మొదట కమీషనర్ చంద్రశేఖర్‌రెడ్డి కౌన్సిల్ సమావేశాన్ని ప్రారంభిస్తు అజెండాలను సభ్యుల తీర్మాను కోసం ప్రవేశపెట్టారు. వెంటనే కౌన్సిలర్ షేక్.షాహుల్ మాట్లాడుతు బుచ్చి నగరపాలక పంచాయితీలో 2 కోట్లు రూపాయాలు గోల్‌మాల్ అయ్యాయని వాటిపైన విచారణ జరిపించాలని ఆయన ఎమ్మెల్యేని కోరారు. అందుకు ఆమె సానుకూలంగా స్పందించారు. కౌన్సిలర్ యరటపల్లి శివకుమార్‌రెడ్డి మాట్లాడుతు మున్సిఫాల్టీలో పనులు టెండర్ల ప్రక్రియలో జరగాలని కోరారు. మలిదేవి బ్రిడ్జి శిదిలావస్థుకు చేరుకుంది అని ఆయన ఎమ్మెల్యే దృష్టికి తీసుకొని వచ్చారు. అలాగే మరికొన్ని సమస్యలు కూడా ఎమ్మెల్యే దృష్టికి తీసుకొనిరాగా వెంటనే స్పందించిన ఎమ్మెల్యే మీరంతా గత ప్రభుత్వం హయాంలో పని చేశారు. అధికారుల పనితీరుపైన ఎందుకు ప్రశ్నించలేదని ఆమె సుతిమెత్తగా చురకలు అంటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు తెలుగుదేశం ప్రభుత్వం ఎంతో పారదర్శకంగా ఉందని ,కేవలం ఎన్నికల సమయం వరకే పార్టీలని తరువాత అభివృద్దికి అందరు కలిసి పనిచేయాలని ఆమె సూచించారు. కౌన్సిలర్ జూగుంట కళ్యాణ్ మాట్లాడుతు సిమెంట్‌రోడ్డులు వేస్తున్నారు. డ్రైన్‌లు వేయడం లేదని దాని వల్ల చాలా ఇబ్బందిగా ఉందని అన్నారు. అందుకు ఎమ్మెల్యే స్పందించి నేను కూడా చాలా దగర చూశాను అలా చేయడం సరికాదని అన్నారు. కౌన్సిలర్ బెళ్ళం మల్లారెడ్డి మాట్లాడుతు ముంబాయి రహదారిలో ఉన్న కాలనీలకు త్రాగునీరు సక్రమంగా అందడంలేదని చెప్పడంతో వెంటనే స్పందించిన కమీషనర్ మున్సిఫల్ లైన్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. అనంతరం కౌన్సిలర్ అందె ప్రత్యూష మాట్లాడుతు కృష్ణా హాల్ సమీపంలో డ్రైన్‌జి పూర్తి స్థాయిలో చేయనందున రోడ్డుపైకి నీరు వచ్చి ప్రజలు ప్రమాదాలకు గురౌతున్నారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే కౌన్సిలర్ బిట్రగుంట ప్రమీలమ్మ మాట్లాడుతు ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణం నాసిరకంగా జరిగాయని వాటిపైన విచారణ జరపాలని డిమాండ్ చేశారు. అనంతరం కౌన్సిలర్ రాచూరు సత్యం మాట్లాడుతు నగరపాలక పంచాయితీలో ఎంతమంది కార్మికులున్నారు, ఎంత మంది తాత్కాలిక ఉద్యోగు లు ఉన్నారు. ఎవరెవ్వరు ఏ విధులలో ఉన్నారు అని ప్రశ్నించారు. కౌన్సిలర్ పుట్టా లక్ష్మీకాంతమ్మ కొట్టాల వద్ద డంపింగ్‌యాడ్‌కి నిధులు మంజూరు అయివున్నాయని గోడ నిర్మాణం చేయాలని కోరారు. అలాగే షాహుల్ మాట్లాడుతు కొంతమంది కార్మికులు ప్రజా ప్రతినిదుల ఇండ్లలో పనిచేస్తున్నారని ఇది ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. డివైడర్‌పైన 5 లక్షల రూపాయాల చెట్లు ఎందుకు అని మల్లారెడ్డి,షాహుల్ ప్రశ్నించారు. కౌన్సిలర్ పఠాన్ నస్రీన్ మాట్లాడుతు ఖాజనగర్‌లో పడి పోయిన బ్రిడ్జిలు వెంటనే పూర్తి చేయాలని కోరారు.

**నగరపాలక పంచాయితీకి ఎంతో ఆదాయం సమకూర్చా : కమీషనర్** బుచ్చిరెడ్డిపాళెం నగరపాలక పంచాయితీకి ఎంతో ఆదాయాన్ని సమకూర్చానని కమీషనర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. కొంతమంది కౌన్సిలర్లు అడిగిన ప్రశ్నిలకు ఆయన సమాదానం ఇస్తు పాత మున్సిఫల్ భవనాన్ని పూర్తి స్థాయిలో తొలగించగా నెలకు 50 వేలు అద్దిఇచ్చి మున్సిఫల్ ఆఫీస్ మరోక భవనంలో పెట్టివుండగా నేను సచివాలయంలోకి మున్సిఫల్ భవనాన్ని మార్చి సంవత్సరానికి 6 లక్షలు మిగిలిస్తున్నానని అన్నారు. బాడుగు ఇండ్లలో ఉన్న 6 సచివాలయాలను సొంత భవనాలలోకి మార్చి బాడుగలు మిగిల్చానని చెప్పారు. అన్ని విషయాలు ప్రశాంతంగా విన్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి బుచ్చిరెడ్డిపాళెం నగరపాలక పంచాయితీ అభివృద్ధి చెందాలంటే అందరం ఐకమత్యంగా ఉండాలని అన్నారు. 31 అజెండాలకు సభ్యులు తీర్మానం చెప్పడంతో ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి, చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా అందరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

## అట్టహాసంగా ప్రారంభమైన కన్యకాపరమేశ్వరి శరన్నవరాత్రి ఉత్సవాలు

### తొలిరోజు శ్రీ భవాని అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారు

### 1008మంది మహిళలచే వేడుకగా కలశస్దాపన,ప్రాణప్రతిష్ట



**నెల్లూరు,అక్టోబరు3 ప్రభాతవార్త-విద్య** నేటి నుండి ఈనెల 13తేదీ వరకు జరుగనున్న వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవ వేడకల్లో భాగంగా తోలిరోజు కలశస్దాపన, ప్రాణప్రతిష్ట కార్యక్రమాలను ఆలయ పాలక మండలి చైర్మన్ కోట గురుబ్రహ్మం, గౌరవాధ్యక్షులు కొండా ప్రవీణ్ శంకర్, ఆర్యవైశ్యమహాస రాష్ట్ర నాయకులు శేగు షణ్ముఖరావుల ఆధ్వర్యంలో అట్టహాసంగా జరిగింది. తొలిరోజు అమ్మవారు శ్రీ భవాని అలంకారంలో భక్తులకు దర్శనభాగా య్నిప్రదర్శించారు. తోలుత ఉదయం 6.30 గంటలకు ఆలయ పాలక మండలి సభ్యులు, ప్రదాన అర్చకులు శివయ్యస్వామితో పాటూ 1008మంది మహిళలు స్దానిక రంగనాధుని ఆలయంలోని పవిత్ర పినాకిని నదీ జలాలను కలిశాలలో సేకరించి ఊరేగింపుగా కన ్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయనాకి చేరుకున్నారు. అనంతరం ఆ పవిత్ర తీర్దంతో అమ్మవారికి అభిషేకం గావించారు. ఈ ఉరేగింపుల్లో పాల్గొన్న మహిళా భక్తులకు ఆలయ పాలకమండలి వెంటి ప్రతిమలను బహూకరించారు. ఈ సందర్భంగా ఆలయ పాలక మండలి సభ్యులు మాట్లాడుతు ఉత్సవాల్లో భాగంగా ఉదయం అమ్మవారికి భవాని అలంకారం, మూలవర్లుకు కుబేర కుంకుమ అలంకారాలు గావించామన్నారు. ఉత్సవాల సందర్భంగా ఉదయం నుండే 1008 మహిళలు భక్త శ్రద్దలతో ఎర్రచీరలు దరించి నదీ జలాలలను కలశాలలో సేకరించి ఊరేగింపుగా అమ మ్మవారి ఆలయానికి చేరుకోవటం జరిగిందన్నారు. నేడు కార్యక్రమాల్లో ఉభయ కర్తలుగా స్వర్గీయ దొంతంశెట్టి కన్నచయ్యశ్రేష్టి ,సుశీలమ్మల కుమారులు వెంకటేశ్వర్లు,



సుజన, మల్లిఖార్జునరావు,లక్ష్మీ దపంతులు వ్యవహరించారన్నారు. అలాగే సాయంత్రం శ్రీనివాస కోలాట మండలిచే కోలాట కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకార్యలు కలుగకుండా అన్నీ చర్యలు తీసుకోవటం జరిగిందన్నారు. పురవాసులు అందరూ ఈ ఉత్సవాల్లో పాల్గొన్ని అమ్మవారిని దర్శించి తరించాలని వారు కోరారు. పాలకమండలి గౌరవాధ్యక్షులు పంఎఇ ఆంజనేయులు, కోశాదికారి వోమ్మిన జనార్దన్, ఉపాధ్యక్షులు వేముల ప్రసాద్, సహాయ కార్యదర్శి మునగా వెంకటేశ్వర్లు, ఉత్సవ కమిటి సభ్యులు సోమిశెట్టి నాగేశ్వరరావు, నాగెల్ల ధనశేఖర్, నూతి రాజాశేఖర్, బైసాని పార్దసారధి చకా బాలచెన్నయ్య, శ్రీకళ తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరు అసెంబ్లీ నియోజకవర్గం రాజకీయ పార్టీలతో సమీక్ష : కమిషనర్

**నెల్లూరు కార్పొరేషన్,అక్టోబర్ 3,ప్రభాతవార్త** : నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయం లోని కమాండ్ కంట్రోల్ నందు నెల్లూరు సిటీ 117 అసెంబ్లీ నియోజకవర్గంకు సంబంధించి మున్సిపల్ కమిషనర్,ఎలక్ట్రెరల్ రిజిస్ట్రేషన్ అధికారుల ఆధ్వర్యంలో గురువారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల తరుపున హాజరైనవారు మాట్లాడుతూ పోలింగ్ స్టేషన్ పరిధిలోని ఒక ప్రాంతానికి సంబంధించిన సరిహద్దు నందు ఇతర పోలింగ్ స్టేషన్ కి సంబందించిన వేరే పోలింగ్ స్టేషన్ యొక్క డోర్ నెం.నమోదు అయ్యాయని ఆ డోర్ నెంబర్లు మార్చి సక్రమంగా ఓటరు లిస్ట్ యందు నమోదు చెయాలని కోరారు.బి.జె.పి పార్టీ తరపున హాజరైన నాయకులు మాత్రము ఓటర్ల లిస్ట్ యందు డోర్ నెం.ల మార్పునకు ఎన్ని దినములు గడువు ఉన్నదని మున్సిపల్ కమిషనర్ ని అడగగా ప్రస్తుతం మీ వద్ద ఉన్నటువంటి అన్ని ఫారాలను ఆన్ లైన్లో నమోదు పరుచుకోవలసినదిగా తెలిపారు.ప్రజాప్రతి నిధుల మీటింగ్ లో హాజరైనటువంటి వారితో కమిషనరు,ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారులతో వివిధ పార్టీల వారు అడిగిన ఓటర్లను పోలింగ్ స్టేషన్ల సమస్యలను కమిషనర్ దృష్టి కి తెచ్చారు.1-1-2025 కి 18 సంవత్సరములు నిండిన వారికి ఓటు హక్కు కల్పిస్తామని,డోర్ నెం,పోలింగ్ స్టేషన్ ల బౌండరీ ల ఓటర్లను విదారించి పోలింగ్ స్టేషన్ పరిధిలోనే ఓట్లు నమోదు పరచగలవారమని కమిషనరు వివరించారు.ఈ సమావేశం లో నెల్లూరు సిటీ తహశీల్దారు షైక్ షఫీ



మాలిక్,ఎలెక్షన్ డిప్యూటీ తహశీల్దార్,వి.ఆనంద్ రావు,ఎలెక్షన్ జునియర్ అసిస్టెంట్ చక్రపాణి,ప్రజా ప్రతినిధులు జి.రాజశేఖర్,టి.బాల సుధాకర్, బి.శ్రీరామ్, యం.హరికృష్ణ, జి.అపాకి,బి.జె.పి పార్టీ వారు తదితరులు పాల్గొన్నారు.

## స్కానింగ్ సెంటర్లు తనిఖీ : ఉప జిల్లా వైద్యశాఖాధికారిణి డాక్టర్ ఎం.ప్రియంవద



**కందుకూరు, అక్టోబర్ 3, ప్రభాతవార్త** జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి ఆదేశాల మేరకు ఉప జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ ఎం.ప్రియంవద పట్టణంలోని డాక్టర్ కోటిరెడ్డి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, సంకల్ప హాస్పిటల్, అజ్మల్ నర్సింగ్ హోమ్, ప్రగతి డాక్టర్ దన్యాసి మాలకొండయ్య హాస్పిటల్, ప్రశాంతి నర్సింగ్ హోమ్ స్కానింగ్ సెంటర్ కేంద్రాలను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరమని అన్నారు. అలాంటివి ప్రోత్సహించకూడదని, పుట్టబోయేది ఆడ మగ బిడ్డ అని అడగకూడదని సూచించారు. పీసీపీఎన్‌డీటీ 1994 చట్ట ప్రకారం లింగ నిర్ధారణ పరీక్షలు చేయవద్దని చెప్పారు. అలాంటి నేరమని అలా చేసిన వారిపై కఠిన చర్యలను తీసుకుంటామని హెచ్చరించారు. రికార్డులను పరిశీలించి ప్రతి నెల స్కానింగ్ వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేసి ప్రతి నెల 2వ తేదీన జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయానికి నివేదికలను పంపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మల్టీపర్పస్ హెల్త్



ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ షేక్ ఆరిపుల్లా పాల్గొన్నారు.

## కలువాయమ్మ సన్నిధిలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు



**కలువాయి అక్టోబర్ 3 ప్రభాతవార్త** కలువాయి గ్రామ దేవత శ్రీకలువాయమ్మ అమ్మవారి దేవస్థానం నందు దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం నుండి ప్రారంభం అయ్యాయి. ఈ సందర్భంగా మొదటి రోజు గ్రామ దేవత శ్రీకలువాయమ్మ అలంకరణలో ఆదిశక్తి భక్తులకు దర్శనమిచ్చింది. ఇందులో భాగంగా ఉదయం అమ్మవారికి పంచామృతాభిషేకాలుసహస్రనామార్చన ప్రసాద వితరణ నిర్వహించా రు. సాయింత్రం మొదటి సారి చేసే సాంప్రదాయ బద్ధంగా కార్యక్రమంలో అమ్మవారి సన్నిధిలో పల్లకీ సేవను నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఉభయకర్తలుగా కలువాయమ్మ దేవస్థానం పూజారులు, వారి కుటుంబ సభ్యులు వ్యవహారించారు. నేడు బాల త్రిపుర సుందరీదేవిగా అమ్మవారుభక్తులకు ధర్శనమివ్వనున్నారు.

## వైభవంగా ప్రారంభమైన శరన్నవరాత్రి వేడుకలు



**సీతారామపురం అక్టోబర్ 3ప్రభాతవార్త** మండలంలో దసరా ఉత్సవాలు ఘనంగా ప్రారంభం అయ్యాయి. మండలంలోనిఘటిక సిద్దేశ్వరం సీతారామపురంలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయం ,బైరవకోనం తదితర దేవాలయాలలో అమ్మవారు విశిష్ట అలంకారాలతో భక్తులకు దర్శనమిచ్చారు. తొమ్మిది రోజులు పాటు జరిగే నవరాత్రి ఉత్సవాలకు భక్తులు పెద్దఎత్తున హాజరై అమ్మవారిని దర్శించుకోవాలని ఆలయాల కమీటి సభ్యులు కోరారు.

## శ్రీశ్రీశ్రీ అంకమ్మ తల్లి అమ్మవారికి వైభవంగా అభిషేకం



**కందుకూరు, అక్టోబర్ 3, ప్రభాతవార్త** కందుకూరు గ్రామదేవత ఆదిపరాశక్తి శ్రీశ్రీ అంకమ్మ తల్లి అమ్మవారి ఆలయంలో విజయదశమి పర్వదినాన్ని పురష్కరించుకుని దేవీ నవరాత్రి ఉత్సవాలు నేటి నుంచి ప్రారంభమయ్యాయి. నవరాత్రుల్లో నేడు మొదటి రోజు శ్రీ అంకమ్మ తల్లి అమ్మవారికి ఉదయం అమ్మవారికి ఆలయ అర్చకులు వేదమంత్రాలతో వైభవంగా అభిషేకం నిర్వహించారు. అమ్మవారిని కన్నుల పండుగగా అలంకరించి, అమ్మవారి అష్టోత్తరం కుంకుమపూజ నిర్వహించారు. ఉభయ దాతలుగా కొణిజేటి రవికుమార్ అని కుమార్ బ్రదర్స్, ఇస్కాల మురళీకృష్ణ, చక్కా బ్రహ్మయ్య, వందవాసి సుబ్బారావు, కొణిజేటి శ్రీనివాసులు వ్యవహారించి శ్రీ విగ్నేశ్వరునికి, శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి, శ్రీ అంకమ్మ తల్లి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆలయాన్ని పూలతో మామిడాకులతో అలంకరించారు. విచ్చేసిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ ఈవో కృష్ణవేణి, భక్తులు పాల్గొన్నారు.

## బాల త్రిపురా సుందరీ దేవిగా రాపూరమ్మ తల్లి



**రాపూరు, అక్టోబరు3ప్రభాతవార్త** మండల కేంద్రమైన రాపూరు గ్రామ దేవత రాపూరమ్మ తల్లికి నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాలలో బాగంగా అమ్మవారికి గురువారం శ్రీ బాల త్రిపుర సుందరీ దేవి అలంకారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం అమ్మవారి ఆలయంలో కళశ స్ధాపన నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి పలు రకాలైన పుష్పాలతోశోబా యమానంగా అలంకారం నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గోని శ్రీ బాల త్రిపురసుందరీ దేవి అలంకారంలో వున్న రాపూరమ్మ తల్లిని దర్శించుకోని పూజలు నిర్వహించారు.

## శ్రీ బాల త్రిపురా సుందరీ దేవిగా శ్రీ వాసవీ మాత



**రాపూరు, అక్టోబరు3ప్రభాతవార్త** మండల కేంద్రమైన రాపూరులో వున్న ఆర్యవైశ్యుల ఆరాధ్య దేవత శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవిశరన్నవరాత్రి ఉత్సవాలలో బాగంగా అమ్మవారు గురువారం శ్రీ బాల త్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాలలో బాగంగా ఉదయం అమ్మవారికి కళశ స్ధాపన కార్యక్రమాన్ని పట్టణంలో ప్రదర్శనగా కళశాన్ని తీసుకువెల్లిఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం నిత్య కోలువు, సహస్త్ర నామార్చన ,కుంకుమార్చన నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి శ్రీ బాల త్రిపుర సుందరీ దేవిగా అలంకారం నిర్వహించారు. వాసవీ మహిళా మండలివారిచే లలితా సహస్త్ర నామ పారాయణం, భజనలు నిర్వహించారు. తదుపరి అమ్మవారికి పల్లకీ సేవ నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గోని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చక స్వాములుకారంచేటి రామనాదేశ్వర శర్మ ఆద్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున అర్యవైశ్యులు, భక్తులు పాల్గోన్నారు.

## జిల్లా బెస్ట్ బ్లడ్ క్యాంపు నిర్వహకులుగా కుడితిపాలెం ఫ్రెండ్స్ యూత్

**ఇందుకూరుపేట, అక్టోబర్ 3, ప్రభాతవార్త** నెల్లూరులోని రెడ్ క్రాస్ సంస్థ వారు ఇందుకూరుపేట మండలం కుడితిపాలెంలోని కుడితిపాలెం ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ వారికి ఈ సంవత్సరం మొత్తం 246 యూనిట్ల రక్తాన్ని రెడ్ క్రాస్ సంస్థకు అందించినందుకు గాను రెడ్ క్రాస్ సంస్థ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, సంస్థ ప్రతినిధులు కుడితిపాలెం ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్‌కు జిల్లా బెస్ట్ బ్లడ్ క్యాంపు మోటివేటర్ అవార్డును అందించడం జరిగింది. ఈ అవార్డును కుడితిపాలెం ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ సభ్యులు షేక్ ముజీర్, ప్రసాద్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, కుడుతుపాలెం సర్పంచ్ నాయుడు సురేష్, రమణయ్య, ఇబాదుల్ల అందుకోవడం జరిగింది. ఈ అవార్డు అందుకొన్నందుకు కుడితిపాలెం ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

# కందుకూరు, కొండముడుసుపాలెం మధ్యలో ఉన్న బైపాస్

### వద్ద ఫ్లైఓవర్ లేదా అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నిర్మించాలి
### సీపీఎం కందుకూరుపట్టణ కమిటీ డిమాండ్



**కందుకూరు, అక్టోబర్ 3, ప్రభాతవార్త** కందుకూరు నుండి కొండముడుసుపాలెం పోయే దారిలో ఉన్న బైపాస్ వద్ద ఫ్లైఓవర్ లేదా అండర్ గ్రౌండ్ బిజీ నిర్మించాలని సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో కందుకూరు సబ్‌కలెక్టర్ తిరుమణి శ్రీ పూజకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి ఎస్‌ఏ గౌస్ మాట్లాడుతూ బైపాస్ వద్ద ఫ్లైఓవర్ లేదా అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నిర్మించాలని కోరారు. కందుకూరు నుండి కొండముడుసుపాలెం, మోపాడు, గుడ్లూరు ఎక్కువగా ట్రాఫిక్ ఉంటుందని కొండముసిపాలెం గ్రామస్తులు అయితే పిల్లల చదువులు కొరకు నిత్యవసర వస్తువుల సరుకుల కొరకు రోజువారి కూలి పనుల కొరకు ఉదయం 5గంటల నుండి రాత్రి పదింటి వరకు వస్తా పోతా ఉంటారని అలాగే కందుకూరు నుండి కావలి ఆర్టీసీ బస్సులు అరగంటకు ఒక సారి తిరుగుతాయని సైకిళ్ళ మీద టూవీలర్ల మీద ప్రజలు తిరుగుతూ ఉంటారని కొండముడుసు పాలెం గ్రామస్తులు అయితే కందుకూరుకు నడక ద్వారా కూడా వస్తారని తెలిపారు. బైసాస్ మార్గం అంటేనే విపరీతమైన వేగంతో తిరిగే వాహనాలు ఉంటాయని వారికి కొత్త మార్గం మీద అవగాహన ఉండదని బైపాస్‌కు తూర్పు పడమర నివాస ప్రాంతాలు ఉండటం వలన బైపాస్ మీద వచ్చే పోయే వాహనాలు ఇరువురికి కనపడవని తెలిపారు. కావున తక్షణమే బైపాస్ వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి గాని అండర్ గ్రౌండ్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని కోరారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఈ సమస్యను పై అధికారులతో మాట్లాడుతున్నామని ఈ సమస్య మూడు డిపార్టుమెంట్ల పరిధిలో ఉందని తెలిపారు. మూడు డిపార్టుమెంట్ల అధికారులతో మాట్లాడుతున్నాయని సాధ్యమైనంతవరకు సమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ నాయకులు డి.రామ్మూర్తి, ఎస్‌కే మున్వర్ సుల్తానా ఎం.రవి, డీఎం రాయుడు పాల్గొన్నారు. టి.వెంకటరావు, ఎస్‌కే మల్లికా, ఎం.పద్మ,

# కరేడు పాఠశాల విద్యార్థులకు ఒకేషనల్ ఇంటర్న్‌షిప్





**ఉలవపాడు, అక్టోబర్ 3, ప్రభాతవార్త** మండలంలోని కరేడు పాతాలం వెంకట సుబ్బయ్య శ్రేష్టి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఒకేషనల్ ఇంటర్న్ షిప్ నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పన్నూరు శ్రీనివాసులు తెలియజేశారు. గురువారం పీఎం శ్రీ స్కూల్స్‌లో నిర్వహిస్తున్న ఒకేషనల్ కోర్సుల్లో పని అనుభవంలో భాగంగా పాఠశాలలోని పదో తరగతి విద్యార్థినీ, విద్యార్థలకు రిటైల్ విభాగంలో ట్రైనర్ తడవర్తి ధనలక్ష్మీ సింగరాయకొండలోని స్మార్ట్ రిటైల్ స్టోర్‌ను విద్యార్థులను సందర్శింపచేసి రిటైల్ రంగానికి సంబంధించిన అంశాలపై మరియు హెల్త్ కేర్ విభాగంలో ట్రైనర్ కుంచాల శైలజ కరేడు ప్రాదమిక ఆరోగ్య కేంద్రంను సందర్శింపచేసి రక్త పరీక్ష, ఓపీ విధానం, వైద్య సేవలు గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పదో తరగతి విద్యార్థినీ, విద్యార్థులు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఒకేషనల్ ట్రైనర్లు ఉపాధ్యాయులు కే.కృష్ణ పాల్గొన్నారు. పాఠశాల విద్యార్థులకు ఇంటర్‌షిప్ నిర్వహించడం పట్ల పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ కోటంగారి బాలేశ్వరరావు, గ్రామస్తులు అభినందనలు తెలియజేశారు.

# శ్రీ పర్వత వర్ధినీ దేవి అవతారంలో పార్వతీ దేవి



**కలిగిరి, అక్టోబర్03, ప్రభాతవార్త;** దాశరా శరన్నవరాత్రుల్లో బాగంగా కలిగిరి శివాలయంలో దశరా వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. శ్రీ పర్వత వర్ధినీ సమేత శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో శరన్నవ రాత్రుల్లో బాగంగా అమ్మవారు మొదటిరోజు బక్తులకు శ్రీ పర్వత వర్ధినీ దేవి రూపంలో బక్తులకు దర్శన బాగ్యం కల్పించారు. ఈ వేడుకలను చూసేందుకు బక్తులు విరివిగా పాల్గొన్నారు. వేడుకల్లో మొదటిరోజు గురువారం అమ్మవారికి ప్రత్యేక కుంకమ పూజ నిర్వహించగా ఈకార్యక్రమంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం అమ్మవారికి అలంకరణ గావించి తదనంతరం పూజలు ,మహిళాబక్తులతో బజనలు తీర్ధ ప్రసాదాలు అందజేశారు. ఈసందర్భంగా బక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ ధర్మకర్త సుద్దల శ్రీనివాసులు అన్నిఏర్పాట్లు చేయగా అమ్మవారి పూజలను ఆలయ ఆగమ పండితులు ఆదిత్యశర్మ శాత్రోత్తంగా నిర్వహించి వచ్చిన బక్తులకు ప్రసాదాలు అందజేశారు. తెల్లపాడులో; కలిగిరి మండలంలోని తెల్లపాడుల్లో దశరా శరన్నవ రాత్రులలో బాగంగా గ్రామంలో వెలసిన శ్రీ బద్రకాళీఅమ్మవారి ఆలయంలో అమ్మవారు శ్రీ బాలాత్రిపుర సుందరిగా బక్తులకు దర్శన మిచ్చారు. ఆలయ ధర్మకర్త జూపల్లి వెంకటేశ్వరరావు ఆద్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, వచ్చిన బక్తులకు తీర్ధ ప్రసాదాలు అందజేశారు.

# కోనలో సౌభాగ్యలక్ష్మీ దేవిగా ఆదిలక్ష్మీ దేవి



**పెంచలకోన(రాపూరు), అక్టోబరు3ప్రభాతవార్త** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీ పెనుశిల లక్ష్మీ నరసింహ స్వామి వారి పట్టమహిషి శ్రీ ఆదిలక్ష్మీ అమ్మవారికి నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాలలో బాగంగా తోలిరోజైన గురువారం ఆదిలక్ష్మీ అమ్మవారికి సౌభాగ్య లక్ష్మీ దేవి అలంకారం నిర్వహించారు. ఇందులో బాగంగా ఉదయం అమ్మవారి మూలమూర్తికి వస్త్రసమర్పణ, పుష్పాలంకరణ నిర్వహించారు. అనంతరం అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలకు కలశ స్థాపన నిర్వహించారు. తదుపరి అమ్మవారికి సౌభాగ్య లక్ష్మీ అలంకారం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి మూలమూర్తికి పూలాంగి సేవనిర్వహించారు. ఈ సందర్భంగా సామూహిక కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అమ్మవారికిప్రాకారోత్సవం నిర్వహించారు. ఆలయ ఉప కమీషనర్ పోరెడ్డి శ్రీనివాసుల రెడ్డి పర్యవేక్షణలో, ఆలయ ప్రధానార్చకులుగుండ్లూరు రామయ్య స్వామి, పెంచలయ్య స్వాముల ఆధ్వర్యంలో అమ్మవారికి పూజా కార్యక్రమాలు ఆలయ అర్చక స్వాములు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గోని అమ్మవారినిదర్శించుకోని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సీనియర్ సహాయకుడు పాలవల్లి లక్ష్మీనారాయణ, అర్చక స్వాములు శశి స్వామి, మధు స్వామి, వినోద్ స్వామి, వర్ధన్ స్వామి, నాగరాజు స్వామి, ఆలయవేదపండితులు పాల్గోన్నారు.

# పర్వత వర్ధనీ అమ్మవారికి ప్రత్యేక పూజలు



**రాపూరు, అక్టోబరు3ప్రభాతవార్త** మండల కేంద్రమైన రాపూరులోని శ్రీ రామనాదేశ్వర స్వామి(శివాలయంలో)వున్న శ్రీ పర్వత వర్ధనీ అమ్మవారికిగురువారం శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంబం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికిప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి పలు రకాలైన పుష్పాలతో శోభాయమానంగా అలంకారంనిర్వహించారు. ఆలయ ప్రధానర్చకుడు కారంచేటి రామనాధేశ్వర శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలునిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

**మహాలక్ష్మీ దేవికి ప్రత్యేక పూజలు** మద్దెలమడుగు సెంటర్‌లో వున్న శ్రీశ్రీశ్రీ మహవిష్ణువు, శ్రీశ్రీశ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో వున్న శ్రీ మహాలక్ష్మీ దేవి అమ్మవారికి శరన్నవరాత్రి ఉత్సవాలలో బాగంగా ఉదయం అభిషేకం, పూలాంగి సేవ ప్రత్యేక పూజలు, ప్రత్యేక అలంకారం నిర్వహించారు.

# రంగనాధ, రాజరాజేశ్వరీ భక్త మండలి ఆధ్వర్యంలో వస్త్ర వితరణ



**నెల్లూరు వైద్యం, అక్టోబరు3ప్రబాతవార్త** శ్రీ రంగనాధ భక్త మండలి, శ్రీ రాజరాజేశ్వరీ భక్త మండలి సభ్యులు గురువారం నగరంలోని జయభారత్‌ఆసుపత్రిలో పలువురు పేదలకు వస్త్ర దానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా భారతీయ జనతా పార్టీజాతియ కిసాన్ మోర్చా నాయకుడు సన్నపురెడ్డి సురేష్ రెడ్డి హాజరై మాట్లాడుతూ గత 20 సంవత్సరాల నుండి రంగనాధ భక్త మండలి సభ్యుల ఆధ్వర్యంలో మెంటా రామ్మోహన రావు పలు విభాగాలలో పనిచేసే కార్మికులకు, పారిశుధ్య కార్మికులకు, కాటికాపరులకు, ఆసుపత్రి సిబ్బందికి క్రమం తప్పకుండా వారి సేవలను గుర్తించి వారికివస్త్రాలను బహుకరించడం కోనియాడదగ్గ విషయం అన్నారు .దేవి నవరాత్రులను పురస్కరించుకోని ఈ పండుగలసందర్భంగా వస్త్ర బహుకరణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బిజేపి నాయకులుమిడతల రమేష్, రామానందగిరఇ స్వామీజీ, భయ్యా బద్రీ నారాయణ, బాల, మువ్వల రాంబాబు, కృష్ణ, మువ్వలసునీల్ మల్లికార్జున తదితరులు పాల్గోన్నారు.

## బదిలీ అయిన ఎంపిడివోకు సత్కారం



**బిట్రగుంట, అక్టోబరు 3 ప్రభాతవార్త** బోగోలు మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా పనిచేస్తూ కొడవలూరు మండలానికి బదిలీ అయిన ఎ.వి.సుబ్బారావును గురువారం మండల పరిషత్ కార్యాలయంలో సన్మానం చేశారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి వివిధ పథకాల అమలులో పురోగతి సాధించినందుకు పలువురు ఆయనను సన్మానించారు. మండల టిడిపి కన్వీనర్ యం. నాగేశ్వరరావు, మాజీ ఎంపిటిసి చిలకపాటి వెంకటేశ్వర్లు, కార్యాలయ పరిపాలనాధికారి ఆర్.గోవిందరావు, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆటోను ఢీకొన్న కారు



**బిట్రగుంట, అక్టోబరు 3 ప్రభాతవార్త** బోగోలు మండలం కోవూరుపల్లి వద్ద గురువారం ఆటోను కారు ఢీకొన్న సంఘటన జరిగింది. కావలి వైపు వెళ్తున్న కారు రోడ్డుకు అడ్డంగా వచ్చిన మేకపోతును ఢీకొనడంతో దానిని కాపాడేందుకు వచ్చిన అతనిని తప్పించబోయి రాంగ్ రూట్‌లో వస్తున్న ఆటోను ఢీకొంది. ఈ ఘటనలో గాయపడిన వారిని 108 వాహనం ద్వారా కావలి ఏరియా వైద్యశాలకు వైద్య చికిత్స నిమిత్తం తరలించి బిట్రగుంట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మెప్మా పొదుపు సంఘాలకు 90 లక్షలు బ్యాంకు రుణం



**బుచ్చి అక్టోబర్ 3 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయితీలో కోవూరు శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మెప్మా పొదుపు సంఘాలకు 90 లక్షలు చెక్కులు పంపిణీ చేశారు. బీబీజాన్ సంఘంకు 20 లక్షలు, ధనలక్ష్మీగ్రూప్‌కి 20 లక్షల రూపాయాలు, గాయిత్రి గ్రూప్‌కు 20 లక్షలు, గణేష్‌గ్రూప్‌కు 20 లక్షలు, పాండురంగ సంఘానికి 10 లక్షలు చొప్పున మంజూరు కాగా ఎమ్మెల్యే గ్రూప్ సభ్యులకు అందజేశారు. ఈకార్యక్రమంలో చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా, కమీషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు ఎంవి శేషయ్య,జొన్నవాడ దేవస్థానం చైర్మన్ పుట్టా సుబ్రమణ్యంనాయుడు, బత్తల హరికృష్ణా,వింజం రామానాయుడు, సిఎంఎం వి .అంకయ్య, సిఒ నర్మద,డిఈ సుజనా, టిడిపి మైనార్టీ నాయకులు బచ్చాయి,డైరక్టర్ తాళ్ళ నరసింహస్వామి, కౌన్సిలర్ జూగుంట కళ్యాణ్, కౌన్సిలర్ వైష్ణవి ,చెంబేటి రామూర్తి,దశరద్, వల్లూరు శ్రీనివాసులు, పఠాన్ మహబూభాషా,దుగ్గిశెట్టి హరినాద్, వింజం మహేష్ నాయుడు, నాగశాలి రాజశేకర్, పలువురు టిడిపినాయకులు పాల్గొన్నారు.

## సోమిరెడ్డి సహకారంతో హిందూ స్మశాన వాటిక అభివృద్ధి



**ముత్తకూరు, అక్టోబర్ 3, ప్రభాతవార్త** సర్వేపల్లి శాసన సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ సహకా రంతో హిందూ స్మశాన వాటిక అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతు న్నాయని మండల టిడిపి ప్రధాన కార్యదర్శి నీలం మల్లికా ర్జున యాదవ్ అన్నారు. గురువారం నవరంగ్ థియేటర్స్ సమీపంలో ఉన్న హిందూ స్మశాన వాటికను పనులను దగ్గరుండి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైకాపా పాలకులు ఐదు సంవత్సరాలు హిందువుల స్మశాన వాటికను గురించి కూడా పట్టించుకోకుండా సొంత ప్రయోజనాలే చూసుకున్నారు తప్ప ఏనాడు దాని అభివృద్ధి చేయలేదన్నారు. మన కోటను ప్రభుత్వం రాగానే ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో హిందువులు స్మశానంకి వెళ్ళేటప్పుడు పారిశుద్ద్య లోపం వల్ల చాలా ఇబ్బందులు గురి అవుతున్నారని దీనిపై దృష్టి పెట్టాలని అడిగిన వెంటనే స్మశానం సంబంధించి పనులను చేపట్టామని చెప్పడంతో స్మశానానికి ఎదురుగా ఉన్న పారిశుద్ధ్యం తొలగించి మట్టితో లెవెలింగ్ చేస్తున్నామని ఆయన తెలిపారు. గ్రామస్తులతో పాటు అందరం ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మి, మైనారిటీ నాయకులు అబ్దుల్ షఫీ ఉల్లా, మండల పట్టణ అధ్యక్షులు బొలిగర్ల శ్రీనివాసులు మాజీ ఉప సర్పంచ్ సుంకర శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## వేమిరెడ్డి దంపతులను కలిసిన 4వ డివిజన్ కార్పొరేటర్



**నెల్లూరు రూరల్, అక్టోబర్ 3, ప్రభాతవార్త** నెల్లూరు సిటీ పరిధిలోని 4వ డివిజన్ కార్పొరేటర్ లక్ష్మీ ప్రత్యూష వెంకటేశ్వర్లు రెడ్డి దంపతులు నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి దంపతులను మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం నెల్లూరులోని విపిఆర్ నివాసానికి చేరుకున్న వారు వేమిరెడ్డి దంపతులను భారీ గజమాలతో సత్కరించారు. శాలువాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఇటీవల 4వ డివిజన్ కార్పొరేటర్ లక్ష్మీ ప్రత్యూష దంపతులు మంత్రి పొంగూరు నారాయణ ఆధ్వర్యంలో మంత్రి నారా లోకేష్ సమక్షంలో పార్టీలో చేరిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గురువారం వేమిరెడ్డి దంపతులను మర్యాదపూర్వకంగా కలిశారు. తుమ్మగుంట శేషయ్య, యేలేశం భాస్కర్ రెడ్డి, చల్లా శంకర్ యాదవ్, నెలవాయి చక్రపాణి రెడ్డి, ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## కొడవలూరులో పరిశుభ్రత



**విడవలూరు, అక్టోబర్ 3, ప్రభాతవార్త** మండల కేంద్రంలో పారిశుద్ద్యం పై పంచాయితీ అధికారులు చొరవ చూపడంతో వీధులు, వీధిలైట్లు శుభ్రపరచుట సైడు కాలువల్లో మురికి నీరు తొలగించి దోమలు చేరకుండా తగిన జాగ్రత్తలు ఏర్పాటు చేశారు. పంచాయితీలోసమస్యలపై అధికారులు శ్రద్ధగా తీసుకోవడంతో గ్రామ ప్రజలు అధికారులను అభినందించారు.

## పొలం పిలుస్తోంది కార్యక్రమం




**పొదలకూరు, అక్టోబర్ 3, ప్రభాతవార్త** పొదలకూరు మండలంలోని బత్తులపల్లి, నేదురుపల్లి గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎ. వాసు, ఉద్యాన అధికారి బి. ఆనంద్, మస్తానయ్య, పట్టు పరిశ్రమ, విస్తరణాధికారి ఆర్‌వై నాయక్ ఏఇఎ, విఎఎ గోవర్ధన్, షరీఫ్‌లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసా యాధికారి మాట్లాడుతూ కాలనుకూల వర్షపాత అనుకూల పంటలు మెట్ట పంటల గురించి వివరించారు. సబ్సీడీ ద్వారా విత్తన సదుపాయం మినము, పెసర 40 శాతం సబ్సీడి, వరి విత్తనాలు కేజీపై 5 రూపాయిలు తగ్గింపు సబ్సీడి అందిస్తామన్నారు. నీటి వినియోగాలు విధానం గురించి అవగాహన కల్పించారు. కౌలుదారులు తప్పనిసరిగా సిసిఆర్‌సి చేసుకోవాలని తెలిపారు. ఉద్యాన అధికారి నిమ్మ పంటలో సూక్ష్మ పోషక లోపాలు లక్షణాలు గురించి సూచించారు. పండ్ల తోటల విస్తరణ కేంద్ర, నిమ్మ, మామిడిలకు సబ్సీడి వివరించారు. సూక్ష్మ సేధ్యం వివరణ చేస్తూ ఆర్‌ఎస్‌కె ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. పంట సాగు, పరిశ్రమల ద్వారా ఆర్థికాభివృద్ధి సావంలభన పురోగతికి దారి తీస్తుందని తెలిపారు.సబ్సీడిపథకాలు రైతులు సద్వినియోగం చేసుకోగలరని తెలియజేశారు.

## గ్రామ సభలో సర్పంచ్‌ని నిలదీసిన సిపిఎం నాయకులు



**విడవలూరు, అక్టోబర్ 3, ప్రభాతవార్త** మండలం గాదెల దిన్నె గ్రామం పంచాయితీ కార్యాలయంలో జరిగిన గ్రామ సభ కార్యక్రమం రసాబసగా జరిగింది. గ్రామ పంచాయితీలో పంచాయితీ, నిధులు ఉన్న త్రాగునీరు, వీధిలైట్లు పరిష్కరించడంలో నిర్లక్ష్యం ఎందుకు చేస్తున్నారని సర్పంచ్ వెంకటేశ్వర్లను సిఎం నాయకులు వెంకటరాయులు నిలదీశారు. గ్రామంలో 600 ఎకరాలు సాగు నీరు కోసం రైతుల ఎదురు చూస్తుంటే ఇప్పటి వరకు పూడిక తీయకపోవడం ఎక్కడ ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్నారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ శేషయ్య, పలు శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతి





**వింజమూరు,అక్టోబర్3ప్రభాతవార్త:** వింజమూరు పంచాయతీపరిధిలోని బొమ్మరాజుచెరువు గ్రామ మెయిన్‌రోడ్డులో జరిగిన ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. కడపజిల్లా పెండ్లిమర్రి గ్రామానికి చెందిన రామసుబ్బారెడ్డి , కడపకు చెందిన ఇల్లూరు శ్రీకాంత్‌రెడ్డి లు యుపిసి విండోస్ కంపెనీకి చెందిన వారు. వీరు కడప నుండి కావలి పట్టణంలోని షిర్డీ సాయి ఎలక్ట్రికల్ షాపు కారులో వెళ్ళి తిరిగి స్వగ్రామమైన కడపకు ప్రయాణమయ్యారు. ఆసమయంలో బొమ్మరాజు చెరువు వద్ద కుక్క అడ్డు రావడంతో కుక్కను తప్పించబోయి కంకర గుట్ట ఎక్కి కారు తిరగబడడంతో ముందు సీట్లో ఉన్న రామసుబ్బారెడ్డి(35) కి కారు అద్దం పగిలి కారు డోర్ ఓపెన్ కావడంతో ఆయన దూరంగా పడిపోయాడు. దాంతో తల నుదిటిభాగం నుజ్జునుజ్జు అయ్యింది. దాంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. శ్రీకాంత్‌రెడ్డి సీట్ బెల్ట్ వేసుకోవడంతో స్వల్పగాయాలైనాయి. విషయం తెలుసుకున్న వింజమూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని కేసునమోదు చేశారు. మృతిచెందిన రామసుబ్బారెడ్డికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. గాయపడిన శ్రీకాంత్‌రెడ్డిని వైద్యచికిత్సకై ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ వీరప్రతాప్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## గ్రామసభలతో గ్రామాభివృద్ధి




**వింజమూరు, అక్టోబర్3ప్రభాతవార్త:** వింజమూరు మండలంలో గ్రామసభల సద్వినియోగంతో గ్రామాల అభివృద్ధికి బాటలు వేయవచ్చని వింజమూరు టిడిపి కన్వీనర్ గొంగటి రఘునాధరెడ్డి పేర్కొన్నారు. గురువారం వింజమూరు పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామసభకు ఆయన హాజరై మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామ సచివాలయ నిర్వహణలపై సమీక్షించి గ్రామసభ తర్వాత పంచాయతీ పరిపాలన యొక్క అన్ని విషయాలను అజెండాలో చేర్చి గ్రామసభలో చదివి వినిపించి గ్రామసభ ఆమోదం పొందవచ్చన్నారు. గ్రామాల్లో చేపట్టాల్సిన పనులు, అభివృద్ధి తదితర కార్యక్రమాలను గ్రామసభలో తీర్మానిస్తారన్నారు. 2024-25 రెండవ త్రైమాసికం పంచాయతీ జమలు-ఖర్చులు చదవడం ద్వారా ప్రజలకు పరిపాలనపై అవగాహన కలుగుతుందన్నారు. ఎన్ఆర్ఇజిఎస్ నిధులు, 15వ ఆర్థిక సంఘ నిధులతో చేపట్టబోయే పనుల ప్రగతిపై సమీక్షించి ఆమోదిస్తారన్నారు. స్వర్ణాంధ్ర 2047కొరకు పంచాయతీ ప్రణాళికలు తయారు చేస్తారన్నారు. వ్యవసాయ విస్తరణ, భూ అభివృద్ధిపనులు, భూసార పరిరక్షణ, మైనర్ ఇరిగేషన్, వాటర్‌షెడ్‌లు, తాగునీరు, గృహనిర్మాణం , రోడ్లు, ఆరోగ్యం తదితర అనేక కార్యక్రమాలను గ్రామసభద్వారా ఆమోదిస్తారన్నారు. ప్రజలు గ్రామసభలకు హాజరై వారి వారి పరిధిలోని సమస్యలు గ్రామసభ దృష్టికి తెస్తే పరిష్కరిస్తారన్నారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ నల్లగొండ్ల సృజన, ఎంఇఒ మధుసూధన్‌రెడ్డి, ఎపిఒ మహబూబ్ సుభాన్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులురెడ్డి, ఎంపిటిసి సభ్యురాలు వనిపెంట హైమావతి, బిజెపి నాయకులు దేగా మధుయాదవ్, మద్దూరు రాజగోపాల్‌రెడ్డి మండలంలోని అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వరికుంటపాడులో ఇదిమంచి ప్రభుత్వం



**అనంతసాగరం,అక్టోబర్3 ప్రభాతవార్త:** వరికుంట పాడులో గురువారం తెలుగుదేశం పార్టీ నాయకులు పాతపాటి మధు సూధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వంద రోజుల్లో ప్రభుత్వం మెచ్చిన కొన్ని ముఖ్యమైన కార్యక్రమాల గురించి ఆయన ప్రజలకు వివరించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరిస్తూ ఇంటింటికి వెళ్ళి కరపత్రాలను అందజేసి స్టిక ర్లు అంటించారు. ఈకార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక చర్యలు



**కోవూరు,అక్టోబర్3 ప్రభాతవార్త :** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు డ్వామా ఏపీడీ మృదుల తెలిపారు. కోవూరు మండలం నేతాజీనగర్‌లోని వైకేఆర్అండ్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఈ పథకం కింద మొక్కలు నాటుటకు సంబంధించి జంగిల్ క్లియరెన్స్ కార్యక్రమాన్ని ఎన్ఆర్ఈజీఎస్ కూలీల ద్వారా పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ కళాశాల ప్రాంగణంలో హైడెన్సిటీ ప్లాంటేషన్‌ను ఏర్పాటు చేసేలా ప్రత్యేకంగా చొరవ తీసుకుంటున్నామన్నారు. మొత్తం ఈ ప్రాంగణంలో 2300 మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. గుంతలు తీయడం దగ్గర నుంచి మొక్కలు నాటడం, వాటి సంరక్షణ బాధ్యత ఈ పథకం ద్వారా చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రామాల్లోని ప్రజలు కూడా కనీసం రెండు మొక్కలు నాటాలని ఎంపీడీవో శ్రీహరి సూచించారు. డ్వామా ఏపీవో సుబ్బారావు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

## వ్యవసాయ శాఖ సలహాలు సూచనలు రైతులు పాటించాలి



**కోవూరు,అక్టోబర్3 ప్రభాతవార్త :** రానున్న రబీ సీజన్‌కు సంబంధించి వరి సాగు చేసే రైతులు వ్యవసాయ శాఖ ఇచ్చే సలహాలు, సూచనలు తప్పక పాటించాలని కోవూరు సహాయ వ్యవసాయ సంచాలకులు సుజాత, తెలిపారు. కోవూరు మండలంౕగుమ్మలదిబ్బ గ్రామంలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు ప్రస్తుత సీజన్‌లో చేపట్టే వివిధ కార్యక్రమాలపై వ్యవసాయ శాఖ, పశు సంవర్ధక శాఖ, మత్స్యశాఖల నుంచి అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు సేంద్రియ ఎరువుల వాడకంపై ప్రత్యేక దృష్టి పెట్టి తప్పనిసరిగా విత్తనశుద్ధి చేసుకో వాలన్నారు. సేంద్రియ ఎరువులను పొలంలో కుప్పలు కుప్పలుగా పోసుకోకుండా అదును చూసి పొలంలో కలియదున్నాలని ఈ సందర్భంగా రైతులకు సూచించారు. ముఖ్యంగా జీవన ఎరువులైన అజిటోబాక్టర్ , జీవన శిలీంద్రలైన సుడోమోనాస్, ట్రైకోడర్మావిరిడిలపై మండల వ్యవసాయాధికారిణి ఇందిరావతి పలు సూచనలు చేశారు. అనంతరం మత్స్యశాఖ ఫిషరీ అసిస్టెంట్ కోటేశ్వరి వారి శాఖ ద్వారా అమలు చేస్తున్న వివిధ పతకాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఎరువుల వాడకం, తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు రైతులు ఉన్నారు.

## పిహెచ్‌డి అవార్డు గ్రహీతలకు సన్మానం



**బిట్రగుంట, అక్టోబరు 3 ప్రభాతవార్త** బోగోలు మండలం కడనూతలలోని ఆర్‌ఎస్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇటీవల పలు యూనివర్శిటీల నుండి వివిధ విభాగాలలో ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న వాసుపల్లి రవీంద్రారెడ్డి, కె.లక్ష్మి, సత్యనారాయణరెడ్డి, కె.జగదీష్‌లు పిహెచ్‌డి అవార్డులు తీసుకున్న సందర్భంగా గురువారం వారిని ఘనంగా సన్మాంచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వి.ఎన్.రెడ్డి తెలిపారు. కళాశాల ఎవో ఆర్.వి.రమణారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సునీల్‌రెడ్డి, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## లక్ష్మీనారాయణకు ఆర్థిక సహాయం చేసిన కావలి బ్రాహ్మణ మహాసంఘం



**కావలి రూరల్, అక్టోబరు 3 ప్రభాతవార్త** కావలి పట్టణం సాత్‌జనతాపేటలో నివాసం వుంటున్న ఉప్పుగుండూరు లక్ష్మీనారాయణ ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండటంతో కావలి బ్రాహ్మణ మహాసంఘం ఆధ్వర్యంలో 10 వేల 120 రూపాయలు, అసోసియేట్ ప్రెసిడెంట్ నందనవనం మధుసూదనరావు 2 వేల రూపాయలు మొత్తం 12 వేల 120 రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కావలి బ్రాహ్మణ మహాసంఘం అధ్యక్షులు పి.వి.ఎస్.ప్రసాద్, ప్రధాన కార్యదర్శి టి.శ్రీనివాసులు, అసోసియేట్ ప్రెసిడెంట్లు చంద్రశేఖర్, నందనవనం మధుసూదనరావు, కోశాధికారి ఆర్.వి.కళాధర్‌రావు,ఉపాధ్యక్షులు గోపి, టి.వెంకటేశ్వర్లు, ప్రాంతీయ కార్యదర్శులు వి.సురేష్, ఎన్.రవికుమా ర్‌శర్మ, శేషయ్య తదితరులు పాల్గొని మాట్లాడారు. కావలి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టడమే కాకుండా ఆర్థికంగా వెనుకబడిన ఎంతో మంది బ్రాహ్మణులకు ఆర్థిక సాయం కూడా చేయడం జరిగిందన్నారు. రానున్న రోజులలో ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

## దగదర్తి గ్రామంలో గ్రామసభ




**దగదర్తి, అక్టోబరు 3 ప్రభాతవార్త** దగదర్తి గ్రామ సచివాలయంలో గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్యఅతిధిగా దగదర్తి ఎంపిడివో శ్రీదేవి, సర్పంచ్ శీనయ్య, ఉపసర్పంచ్ నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు. ఈ గ్రామసభలో దగదర్తి గ్రామ ప్రజల సమస్యల అర్జీలను స్వీకరించారు. ఈ సమస్యలు త్వరగా పరిష్కరిస్తామని ఎంపిడివో తెలిపారు.

## ఉపాదిహామి పనుల గుర్తింపుకై గ్రామసభ



**జలదంకి,అక్టోబర్3,ప్రభాతవార్త:** జలదంకి మండలం బ్రాహ్మణక్రాకలో ఉపాదిహామీ పనుల గుర్తింపు గ్రామసభ గురువారం నిర్వహించారు.స్థానిక బిట్1 సచివాలయంలో జరిగిన సభ సర్పంచ్ ఇండ్ల సుధాకర్ అధ్యక్షతన జరిగింది. ఈసమావేశంలో 15వ ఆర్ధికసంఘ,సాధారణ, ఎన్ఆర్ ఇజిఎస్ నిధులు వినియోగంపై చర్చించారు. ఈకార్యక్రమంలో గ్రామ కార్యదర్శి,వార్డు సభ్యులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## విక్రమసింహపురి టూవీలర్స్ సంఘ సమావేశం



**వింజమూరు, అక్టోబర్3ప్రభాతవార్త:** వింజమూరులోని ఎస్‌వి కన్వెన్షన్ హాల్లో టూవీలర్స్ అసోసియేషన్ సమావేశాన్ని సంఘ కార్యదర్శి షేక్ అన్వర్‌బాషా ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సహాయ కార్మిక శాఖ అధికారి వై.సత్యనారాయణ, కలిగిరి ఎస్ఐ ఉమామహేశ్వరరావ్‌లు హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ టూవీలర్స్ మెకానిక్‌ల అసోసియేషన్ ఏర్పడడం శుభపరిణామమని , ప్రతి ఒక్కరూ వారు చేస్తున్న పనిలో నైపుణ్యం సాధించి మెరుగైన జీవనం పొందాలన్నారు. ప్రభుత్వ సూచనలు పాటిస్తూ మంచి వ్యక్తులుగా మెలగాలన్నారు. మెకానిక్ షాపుల్లో మైనర్ బాలురను పనుల్లో చేర్చుకోవద్దన్నారు. అసోసియేషన్ సభ్యులుగా ఉండడంతో వారికి ఐడి కార్డులు ఉండడంతో రాత్రి సమయంలో ఏదైనా మెకానిక్ పనిపై వస్తున్న సమయంలో పోలీసులు అడ్డగిస్తే గుర్తింపుకార్డును చూపడంతో వారు అనుమతిస్తారన్నారు. దొంగతనంగా తెచ్చిన వాహనాలను కొనడం , అమ్మడం నేరమన్నారు. మెకానిక్‌లు టెస్ట్ డ్రైవింగ్ పేరుతో రాష్ డ్రైవింగ్ చేయరాదన్నారు. అసోసియేషన్ సభ్యులు ఒకరినొకరు తమ కష్టసుఖాలను పాలుపంచుకోవచ్చన్నారు. ఈకార్యక్రమంలో అధ్యక్షుడు రఫి, ఉపాధ్యక్షుడు టివిఎస్‌బాషా, కోశాధికారి రసూల్, కలిగిరి మండల అధ్యక్షుడు ఎస్.డి.మస్తాన్, ఉపాధ్యక్షుడు సోము సుబ్బారెడ్డి, కొండాపురం మండల అధ్యక్షుడు సయ్యద్ బాబు, మాధవరెడ్డి, 50మంది సభ్యులు పాల్గొన్నారు.

## సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహశీల్దార్‌చే యండియు వాహనాలు తనిఖీ



**బిట్రగుంట, అక్టోబరు 3 ప్రభాతవార్త** బోగోలు మండలంలో గురువారం కప్ప రాళ్ళతిప్ప, ముంగమూరు గ్రామాలలో ప్రజా పంపిణీ పథకం కింద రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్న ఎండియు వాహనాలను కావలి సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహశీల్దార్ యం.విజయమ్మ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పంపిణీ ద్వారా లబ్దిదారులకు సరుకులు అందుతున్న వైనం, తూనికలు, కొలతలు తదితర విషయాలపై ఆమె ఆరా తీశారు. మండలంలోని యండియు ఆపరేటర్లు అందరూ సకాలంలో పంపిణీ మొదలు పెట్టి వేగవంతం చేయాలని లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని వారిని హెచ్చరించారు.

## జాతీయ రక్తదానోత్సవాలలో కావలి ఆర్టీసీ డిపోకు ఉత్తమ మోటివేటర్ అవార్డు




**కావలి, అక్టోబరు 3 ప్రభాతవార్త** జాతీయ రక్తదానోత్సవాలలో భాగంగా గురువారం నెల్లూరు రెడ్‌క్రాస్ రక్త కేంద్రంలో నిర్వహించిన జిల్లా స్థాయి రక్తదాన మోటివేటర్ల అభినందన కార్యక్రమంలో కావలి ఆర్టీసీ డిపోకు ఉత్తమ మోటివేటర్ అవార్డు వచ్చింది. రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్, ఉపాధ్యాయ శాసనమండలి సభ్యులు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా ఈ అవార్డును అప్పటి కావలి డిపో మేనేజర్ (ట్రాఫిక్) కె.వి.ఆర్.బాబు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడారు. గత ఫిబ్రవరి మాసంలో ఎపిఎస్ఆర్‌టిసి రోడ్డు భద్రత పక్షోత్సవాల సందర్భంగా అన్ని జిల్లా కేంద్రాలలో రక్తదాన శిబిరాలు నిర్వహించడం జరిగిందన్నారు. కావలి డిపో మేనేజర్, సిబ్బంది డిపో పరిధిలో రక్తదాన శిబిరం నిర్వహించడానికి అనుమతి పొంది రాష్ట్రంలోనే అత్యధిక సంఖ్యలో రక్తదానం చేయించి ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. నెల్లూరు జిల్లాకే గర్వకారణమైందన్నారు. కావలి డిపో పరిధిలో అవార్డు స్వీకరించిన కె.వి.ఆర్.బాబును డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు, వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు అభినందనలు తెలిపారు. డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు మాట్లాడారు. సిబ్బంది, ఉద్యోగ సంఘాల నాయకుల సమిష్టి కృషి వల్ల తాము నిర్వహించిన రక్తదాన శిబిరం రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచి ఆర్టీసీ, రెడ్‌క్రాస్ రాష్ట్ర అధికారుల మన్ననలు పొందిందన్నారు. ఆ సమయంలో శిబిర విజయవంతానికి కృషి చేసిన కె.వి.ఆర్.బాబు ఉద్యోగ విరమణ చేసి ఆరు నెలలైనా ఆయనకే అవార్డు తీసుకునే అవకాశం కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ (ట్రాఫిక్) యం.రామకృష్ణ, బస్ స్టేషన్ సూపర్‌వైజర్ యం.రమేష్‌బాబు, డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ దాకారపు రవిప్రకాష్, ఉద్యోగ సంఘ నాయకులు టి.రఘునాధరెడ్డి, చెంచు రామయ్య, కె.వి.రమణయ్య, వెంకటేశ్వర్లు, నారపరెడ్డి, కావలి రెడ్‌క్రాస్ బాధ్యులు కలికి శ్రీహరిరెడ్డి, దామిశెట్టి సుధీర్‌నాయుడు, గంధం ప్రసన్నాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్లు ధ్వంసం చేసిన గ్యాస్ పైప్‌లైన్ నిర్వాహకులపై చర్యలు చేపట్టాలి



కావలి, అక్టోబరు 3 ప్రభాతవార్త తీర ప్రాంత గ్రామాలలో రోడ్లు ధ్వంసం చేసిన గ్యాస్ పైప్‌లైన్ నిర్వాహకులపై వెంటనే చర్యలు చేపట్టాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్.మల్లి డిమాండ్ చేశారు. గురువారం కావలి ఆర్డీవో కార్యాలయ ఆవరణలో దళిత సంఘర్షణ సమితి ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఆర్డీవోకు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఎస్.మల్లి మాట్లాడారు. కృష్ణపట్నం నుండి విశాఖపట్నం వరకు వందల కోట్ల రూపాయల ఖర్చుతో గ్యాస్ లైన్ పైప్ వేస్తున్నారన్నారు. ఐదు అడుగుల లోతు తీయడం వల్ల కృష్ణపట్నం నుండి విశాఖపట్నంకు పోయే రోడ్లను, సిసి రోడ్లను ధ్వంసం చేశారన్నారు. టిడిపి పరిపాలన సమయంలో తీర ప్రాంత గ్రామాలలో రోడ్లు అన్ని వేశారన్నారు. వాటిని గ్యాస్ పైప్‌లైన్ నిర్వాహకులు ధ్వంసం చేశారన్నారు. ధ్వంసం చేసిన రోడ్లపై మట్టి చల్లి వెళ్తున్నారన్నారు. వర్షాకాలంలో వరద నీరు వచ్చే ముంపు వుందన్నారు. అందుచేత వేల కోట్ల రూపాయల విలువైన గ్యాస్ పైప్‌లైన్ కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుని తీర ప్రాంత గ్రామాలలో కృష్ణపట్నం నుండి మన జిల్లా దాకా తారురోడ్లు, సిమెంట్ రోడ్ల నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. నీటి పైపులైన్లు కూడా ధ్వంసం చేశారన్నారు. రెవెన్యూ అధికారులు, కాంట్రాక్టర్లపై చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో అంచిపాక రత్నం, చెరుకూరి జనార్ధన్, జ్యోతిజాన్, పి.శ్రీనివాసులు, కె.ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

